క్లుప్తంగా

జిల్లా ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే వైవీఆర్



జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లుటౌన్: అనంతపురం జిల్లా ఎస్పీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కె.శ్రీనివాసరావును గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం ఎస్పీ కార్యాలయంలో శ్రీనివాసరావును కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. నియోజకవర్గంలోని ఆయా పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో గల పలు సమస్యలను ఎస్పీకి వివరించి వాటిని పరిష్కరించాలని ఎమ్మెల్యే కోరారు.

ఆర్టీసీ బస్టాండు అద్దెకు టెండర్ల ఆహ్వానం

యాడికి: మండల కేంద్రంలో 3.91 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఆర్టీసీ బస్టాండును అద్దెకు ఇవ్వాలని నిర్ణయించినట్లు తాడిపత్రి ఆర్టీసీ డిపో మేనేజర్ శంకరయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 22 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, 23న మధ్యాహ్నం టెండర్లు ఖరారు చేస్తామని పేర్కొన్నారు. వివరాలకు 7282860183, 9959225856 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వార్డు సచివాలయం తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసులు

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు సచివాలయాన్ని గురువారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయ ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించారు. స్పందనలో ప్రజలు ఇచ్చిన అర్జీలపై ఆరా తీశారు. పని తీరు మెరుగు పరుచుకోవాలని సచివాలయ ఉద్యోగులకు సూచించారు. విధులకు గైర్హాజరైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇన్‌చార్జ్ కమిషనర్‌గా శేషన్న



తాడిపత్రి టౌన్: స్థానిక మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా గురువారం గుంతకల్లు మున్సిపల్ కమిషనర్ శేషన్న బాధ్యతలు స్వీకరించారు. తాడిపత్రి ఇన్‌చార్జ్ కమిషనర్ జబ్బార్‌మియా సెలవుపై వెళ్లడంతో గుంతకల్లు మున్సిపల్ కమిషనర్‌కు ఉన్నతాధికారులు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం పట్టణంలో జరుగుతున్న అండర్ డ్రైనేజీ పనులను కమిషనర్ పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయండి



రేషన్ పంపిణీని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ అలెగ్జాండర్

యాడికి: కార్డుదారులకు రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ అలెగ్జాండర్ ఎండీయూ ఆపరేటర్లకు సూచించారు. గురువారం ఆయన మండల కేంద్రంలో ఎండీయూ వాహనాల ద్వారా చేపడుతున్న రేషన్ పంపిణీని తనిఖీ చేశారు.ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో 35 రేషన్ దుకాణాలున్నాయని, వీటి పరిధిలో 10 ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరుకులను పేదలకు ఇళ్ల వద్దకు వెళ్లి అందజేయాలన్నారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ సూర్యనారాయణ, వీఆర్వోలు పాల్గొన్నారు.

గడప గడపలో సంతోషం

- ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి



చామలూరులో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

నార్పల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలతో గడప గడపలోనూ సంతోషం వెల్లివిరుస్తోందని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. గురువారం ఆమె చామలూరు, నిలువురాయిలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగి నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని తెలియజేశారు. దేవరశెట్టి శ్రీరాములు కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా వైఎస్సార్ ఆరోగ్య శ్రీ, బీమా, ఆసరా, రైతు భరోసా, పింఛన్ కానుక ద్వారా రూ.6,72,591 లబ్ధి చేకూరిందని వివరించారు. పోస విజయమ్మ కుటుంబానికి వివిధ పథకాల ద్వారా రూ.4,25,750 లబ్ధి పొందినట్లు తెలియజేశారు. స్థానికులతో సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించాలనే అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. అర్హత ఉంటే చాలు గడప వద్దకే సంక్షేమ పథకాలు వస్తాయని ఎన్నికల ముందు జగనన్న హామీ ఇచ్చారని, ఆ రోజు ఇచ్చిన మాట తూచ తప్పకుండా నేరవేరుస్తున్నారని గుర్తు చేశారు. ఇన్ని చేస్తున్నా పచ్చ పార్టీ, పత్రికలు మాత్రం రోజూ ప్రభుత్వంపై బురదజల్లేందుకు యత్నిస్తున్నామయన్నారు. రాష్ట్ర ప్రజలకు మంచి చేయాలనే ఆలోచన లేని పచ్చ పార్టీ జగనన్న ప్రభుత్వం చేస్తున్న మంచిని చూసి ఓర్వలేక పోతోందన్నారు. ప్రజలకు ఎం కావాలో ఎం చేయాలో జగనన్నకు తెలుసని, ఇప్పటికైనా చంద్రబాబు కుట్రలు, కుతంత్రాలు ఆపి రాష్ట్ర అభివృద్ధిని, సంక్షేమానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ డైరెక్టర్ నిట్టూరు రఘునాథ్ రెడ్డి, అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, ఎంపీపీ నాగేశ్వరావు, వైస్ ఎంపీపీ మల్లేశ్వరయ్య, సర్పంచు స్వప్న, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మిద్దె కుళ్లాయప్ప, నాయకులు సూరి, సూర్యనారాయణరెడ్డి, కృష్ణారెడ్డి, సునిత, రామచంద్రారెడ్డి, రవి, రాము, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

గుంతకల్లు రూరల్: దంచర్ల గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జాషువా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు హాజరుకావాలని సూచించారు.

పుట్లూరు: మండలంలోని రంగరాజుకుంట, రంగమనాయునిపల్లి గ్రామాల్లో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ యోగానంద రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి హాజరువుతారని పేర్కొన్నారు. అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తప్పక హాజరు కావాలని సూచించారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



జొన్నలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్, ఆర్డీఓ రవీంద్ర

గుంతకల్లుటౌన్: చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలన్న ధ్యేయంతో జగనన్న ప్రభుత్వం రేషన్‌కార్డుదారులకు చిరుధాన్యాలను పంపిణీ చేస్తోందని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి తెలిపారు. గురువారం 24వ వార్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే, ఆర్‌డీఓ రవీంద్ర రేషన్‌కార్డుదారులకు జొన్నలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మన పూర్వీకుల ఆరోగ్యాన్ని, బలాన్ని పరిశీలిస్తే వారు కష్టపడి పనిచేసే వారని, ప్రధానంగా చిరుధాన్యాలనే ఆహారంగా తీసుకునేవారన్నారు. ఒకప్పుడు నిరుపేదల ఆకలి తీర్చిన చిరుధాన్యాలకు మళ్లీ మహర్దశ మొదలైందన్నారు. నేటి యాంత్రిక జీవన విధానంలో పేదలకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పోషక ఉత్పత్తులు అందించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఖరీఫ్ సీజన్ నుంచి చిరుధాన్యాల సాగు విస్తీర్ణాన్ని పెంచేలా వ్యవసాయ, పౌరసరఫరా శాఖలు సన్నద్ధమయ్యాయన్నారు. రేషన్ డోర్ డెలివరీ వాహనం ద్వారా ప్రభుత్వం ప్రతి నెలా సబ్సిడీతో అందించే బియ్యం, కందిపప్పు, చక్కెర, జొన్నను ప్రజలకు తీసుకోవాలన్నారు. గుంతకల్లు పట్టణం, మండలంలోని 47,476 రేషన్‌కార్డుదారులకు ఒక కిలో బియ్యం బదులుగా జొన్నలను ఉచితంగా అందజేసినట్లు అధికారులు వెల్లడించారు. సీఎస్‌డీటీ సుబ్బలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హమాలీ సంఘం నేత మృతి



చంద్ర(ఫైల్)

గుత్తి: పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన హమాలీ సంఘం నేత నగదాని చంద్ర(40) గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నగదాని చంద్ర మృతి పట్ల హమాలి సంఘం అధ్యక్షుడు నగదాని సత్య, పురుషోత్తం, జయపాల్ తదితరులు సంతాపం ప్రకటించారు.

బాధితుడికి పరామర్శ



కంబగిరిరెడ్డిని పరామర్శిస్తున్న పామిడి వీరా

పామిడి: రామరాజుపల్లి గ్రామానికి వైఎస్సార్‌సీపీ నేత వీ కంబగిరిరెడ్డి రెండురోజుల క్రితం పడి కాలువిరగడంతో అనంతపురంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఎం.వీరాంజనేయులు గురువారం ఆస్పత్రికి చేరుకుని కంబగిరిరెడ్డిని పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులతో అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ కిసాన్‌సెల్ జిల్లా సంయుక్త కార్యదర్శి బీ రమణారెడ్డి, మాజీ సర్పంచ్ బయపరెడ్డి, దామోదర్ రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, పెద్దన్న, రంగనాథ్ ఉన్నారు.

ఉపాధి అవకాశాలు పెంచడమే లక్ష్యం



విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: విద్యార్థులకు అవసరమైన నైపుణ్యాలను నేర్పించి వారికి ఉపాధి అవకాశాలను కల్పించడమే తమ లక్ష్యమని ఎస్ఎస్‌జీఎస్ కళాశాల కరస్పాండెంట్ కేసీ హరి, ప్రిన్సిపాల్ గోపాల్ పేర్కొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రముఖ ఐటీ దిగ్గజ కంపెనీ టీసీఎస్‌తో తమ కళాశాల ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఆసంస్థకు చెందిన నిపుణుల పర్యవేక్షణలో కళాశాలకు చెందిన 160 మంది విద్యార్థులకు శిక్షణ పూర్తి చేశారన్నారు. ఈనెల 5న బెంగళూరులో టీసీఎస్ కంపెనీ ఆధ్వర్యంలో రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్న తరుణంలో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు అక్కడికి పంపుతున్నట్లు తెలిపారు. రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌కు హాజరవుతున్న తమ కళాశాల విద్యార్థులకందరికీ ఉద్యోగాలు రావాలని ఆయన కోరుకున్నారు.

ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలి



ముంటిమడుగులో వరి పంటను పరిశీలిస్తున్న దృశ్యం

గార్లదిన్నె: అకాల వర్షంతో నేలకొరిగిన వరి ధాన్యం మొలకెత్తకుండా రైతులు ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలని రేకులకుంట ఏఆర్ఎస్ పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ రమణ పేర్కొన్నారు. గురువారం ముంటిమడుగులో వ్యవసాయ శాఖ ఏడీ వెంకటరాముడుతో కలిసి ఆయన అకాల వర్షం వల్ల దెబ్బతిన్న పొలాలను పరిశీలించారు. ఈసందర్భంగా డాక్టర్ రమణ మాట్లాడుతూ మండలంలో నాలుగు రోజుల్లో 118.8 ఎంఎం వర్ష పాతం నమోదు కావడంతో 565 ఎకరాల్లో వరి, మొక్కజొన్న 17 ఎకరాలు, వేరుశనగ 3 ఎకరాలు, పత్తి 3 ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. వరి పంట పడిపోతే ధాన్యం మొలకెత్తకుండా ఎకరాకు 50 గ్రాముల ఉప్పు, 5 లీటర్లు నీటికి కలుపుకొని ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలన్నారు. వరి పంట ఏప్రిల్‌లో కోతకు వచ్చేలా నాట్లు వేసుకోవాలన్నారు. ప్రతి మూడేళ్లకోసారి పంట మార్పిడి చేసుకోవాలని సూచించారు. ఏఓ సోమశేఖర్, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడండి



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయభాస్కర్

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ విజయభాస్కర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ నాలుగు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ప్రతి గ్రామంలో పారిశుధ్య పనులు చేయించాలన్నారు. అంతకు ముందు గార్లదిన్నె గ్రామ సచివాలయం 1,2ను తనిఖీ చేశారు. సిబ్బంది బయోమెట్రిక్ నమోదు రికార్డులు పరిశీలించారు.

కేసు నమోదు

గుత్తి: పట్టణంలోని దాసరి కాలనీలో ఈ నెల 1వ తేదీన అమ్మాయి పెళ్లి సంబంధం విషయంపై చిరంజీవి, పెద్ద రామాంజనేయులు వర్గాల మధ్య ఘర్షణ జరిగి ఇరు వర్గాలకు చెందిన ఆరుగురు గాయపడిన విషయం విదితమే. ఈ ఘటనపై ఇరువర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేశాయి. విచారించిన పోలీసులు ఇరు వర్గాలకు చెందిన 12 మందిపై 160 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు.

ప్రజల సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న ఎంపీపీ యోగేశ్వరి

శింగనమల: గ్రామాల్లో ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపీపీ యోగేశ్వరి అధికారులను కోరారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సచివాలయాలకు వచ్చే ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించాలన్నారు. మండల వ్యవసాయాధికారి చిన్నమ్మ మాట్లాడుతూ అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటల నష్టంపై ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు తెలిపారు. ట్రాన్స్‌కో ఏఈ విజయకుమార్ మాట్లాడుతూ గాలివానలకు విద్యుత్ సమస్యలు ఏర్పడే అవకాశం ఉందని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. చిన్న సమస్య ఏర్పడిన తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో ఎంపీడీఓ నిర్మలాకుమారి, మండల స్పెషలాఫీసర్ ఉమాశంకరమ్మ, వైస్ ఎంపీపీలు నరసింహులు, విజయ, ఎంపీటీసీలు కురబ ఉమా, ఆలీ, సర్పంచ్‌లు, మండల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు



క్షతగాత్రులను 108లో తరలిస్తున్న దృశ్యం

గార్లదిన్నె: తిమ్మంపేట సమీపంలో 44వ జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. పోలీసులు, తెలిపిన వివరాలు.. పామిడి నుంచి అనంతపురముకు ప్రయాణికులతో వెళ్తున్న ఆటో తిమ్మంపేట వద్దకు రాగానే డ్రైవర్ వేగాన్ని తగ్గించాడు. వెనుక వస్తున్న కారు ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొట్టి ఆటోను వెనుక వైపు ఢీకొంది. ఘటనలో ఆటోడ్రైవర్ గంగరాజు, ప్రయాణికులు శ్రీదేవి,కామాక్షి, సాయి రక్తగాయాలయ్యాయి. స్థానికులు వారిని 108లో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ గురుమూర్తి తెలిపారు.

ఘనంగా నృసింహ జయంతి



నృసింహ జయంతిని నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో గురువారం నృసింహ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ ముఖ మండపంలో నరసింహస్వామి చిత్రపటాన్ని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

ముమ్మరంగా పెద్దకాలువ పూడికతీత పనులు



పూడికతీత పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పామిడి: పట్టణంలోని పెద్దకాలువలో గురువారం పూడికతీత పనులు ముమ్మరంగా కొనసాగాయి. మూడు రోజులుగా కురిసిన వర్షాలకు పెద్దకాలువలో చెత్తాచెదారం పేరుకుపోయి నీరు ముందుకు సాగడం లేదు. ఇటీవల కలెక్టర్ గౌతమి పర్యటనలో దీన్ని గుర్తించి నిల్వ ఉన్న మురుగునీటి ముందుకు వెళ్లేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. దీంతో ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్ దగ్గరుండి పెద్దకాలువ పూడికతీత చేయించారు.

10న ఆలయ భూముల కౌలు వేలం

నార్పల: గూగూడు గ్రామానికి చెందిన ఆంజనేయ స్వామి, అక్కదేవతలు, భైరవస్వామి ఆలయ భూముల కౌలు వేలాన్ని ఈ నెల 10న గూగూడులోని చెన్నకేశవస్వామి ఆలయంలో నిర్వహించనున్నట్లు ఈఓ శోభ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు రూ.1,000 ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు.

'వైఎస్సార్ కంటి వెలుగు' పేదలకు వరం



శిబిరానికి హాజరైన ప్రజలు

యాడికి : వైఎస్సార్ కంటి వెలుగు పేదలకు వరం లాంటిదని కంటి వైద్యనిపుణుడు మధుసూదన్‌రాజు అన్నారు. గురువారం నరసాపురంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి సమస్యతో బాధపడుతున్న 48 మందిని పరీక్షించారు. ఇందులో 8 మందికి కంటి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. వీరికి ఈనెల 25, 26, 27 తేదీల్లో అనంతపురంలోని శారదానగర్‌లోని సంచార వైద్యశాలలో ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు మధుసూదన్‌రాజు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచు రంగనాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

బుక్కరాయసముద్రం: ప్రస్తుతం అకాల వర్షాలు కురుస్తున్నందున వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పట్టణ ఆరోగ్య కేంద్రం డాక్టర్ స్వాతిలక్ష్మి పేర్కొన్నారు. గురువారం ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వాతి లక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లో మురుగునీరు నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వ్యాధులపై సర్వే చేయాలన్నారు. ఇళ్లలో ఎవరైనా అనారోగ్యంగా ఉన్నట్లు తెలిస్తే వారిని గుర్తించి వెంటనే చికిత్స పొందేలా చర్యలు చేపట్టాలన్నారు. సీహెచ్‌ఓ మోహన్‌రావు, సూపర్‌వైజర్లు ఈశ్వరమ్మ, హెల్త్ అసిస్టెంట్లు ధనుంజయ, ఆనంద్, మిడ్ లెవల్‌హెల్త్ ప్రొవైడర్ గౌతమి, జ్యోతి, మంజు భార్గవి, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

వ్యక్తి మృతి

గార్లదిన్నె: ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తి బుధవారం రాత్రి మృతి చెందాడు. ఏఎస్ఐ గురుమూర్తి తెలిపిన వివరాలు.. కొట్టాలపల్లికి చెందిన ఎర్రిస్వామి(35) అనే వ్యక్తి అనారోగ్య సమస్యలతో నెల రోజుల క్రితం ఇంటి వద్ద ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స ఫలించకపోడంతో అక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య,కుమార్తె, కుమారుడు ఉన్నారన్నారు. కేసు నమోదు చేసుకున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

వైభవంగా బండిశిల రథోత్సవం



గుత్తిఅనంతపురం బండిశిల తిరునాల రథాన్ని లాగుతున్న దృశ్యం

పెద్దవడుగూరు : మండలంలోని గుత్తిఅనంతపురం, కాశేపల్లి మీదుగా రెండో రోజు గురువారం బండి శిల రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాశేపల్లి, గుత్తిఅనంతపురం గ్రామాల రైతులు తమ ఎద్దులను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. సాయంత్రం ఎద్దులతో సుడిబండిని లాగించారు. ఈసందర్భంగా రైతులు సుడిబండి ముందు చిందులు వేయడం ఆకట్టుకుంది.

లక్ష్మీ నరసింహస్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో కోన లక్ష్మీనరసింహస్వామి

తాడిపత్రి టౌన్: ఆవుల తిప్పాయి పల్లిలోని ఓబులేసుకోన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి ఉత్సవ విగ్రహాలకు క్షీరాభిషేకం అనంతరం ప్రత్యేకంగా ఆలంకరించి పూజలు చేపట్టారు. అనంతరం రాత్రి గజ వాహనంపై స్వామిని ఆలయ ఆవరణలో ఊరేగించారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత పాటించాలి

గార్లదిన్నె: ప్రతి ఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించాలని అధికారులు ప్రజలకు సూచించారు. ఇల్లూరులో ఇద్దరికి డెంగీ అనుమానిత లక్షణాలు కన్పించడంతో గురువారం వైద్యసిబ్బంది, సచివాలయ సిబ్బందితో కలిసి గ్రామంలో పర్యటించారు. ఈసందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి జ్వరంపై సర్వే చేపట్టారు. దోమల నివారణకు మురుగుకాలువలు, మురుగునీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమల మందు పిచికారీ చేశారు. కార్యక్రమంలో సర్పంచు జయరాముడు, పంచాయతీ కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి, సీహెచ్‌ఓ లోక్‌నాథ్, అనిత, హెల్త్ సూపర్ వైజర్ విశ్వనాథయ్య, అనంతపురం మలేరియా సబ్ యూనిట్ అధికారి మద్దయ్య, సచివాలయం ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుత్తి కోట సందర్శన

గుత్తి: చరిత్రాత్మకమైన గుత్తి కోటను గురువారం రచయితల సంఘం జిల్లా కార్యదర్శి టీవీ రెడ్డితోపాటు పలువురు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మొదట కోట కింద భాగంలో ఉన్న ఫిరంగులు, కోటలోని ఏనుగుల శాల, గుర్రపు శాల, చీకటి గదులు, బావులు తదితరాలను పరిశీలించారు. గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయభాస్కర్, సభ్యులు చిరంజీవి, దేవేంద్ర రాయల్ తదితరులు పాల్గొన్నారు.

విపత్తుల నివారణకు కంట్రోల్ రూము ఏర్పాటు

గుంతకల్లు రూరల్: భారీ వర్షాల కారణంగా విపత్తులు సంభవించే ప్రమాదం ఉన్న నేపథ్యంలో స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో విపత్తుల నివారణ కోసం కంట్రోల్ రూము ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ రాము గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 24 గంటల పాటు కంట్రోల్ రూము అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. భారీ వర్షాలతో ఎక్కడ ఎటువంటి విపత్తు సంభవించిన వెంటనే 9885622029 (ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ) , 9502716847 (రాత్రి 8 గంటల నుంచిఉదయం 8 గంటల వరకూ) నంబర్లలో సంప్రదించాలని సూచించారు.